పరేడ్‌లో పాల్గొన్న విద్యార్థినికి సన్మానం

విద్యార్థిని యశస్వినిని సన్మానిస్తున్న నాయకులు

మల్లాపూర్, ఫిబ్రవరి 8: ఇటీవల ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో భాగంగా పరేడ్‌కు వీవీరావుపేటకు గ్రామానికి చెందిన గుగ్లావత్ యశస్విని అనే విద్యార్థిని ఎంపికైన సంగతి తెలిసిందే. కాగా సదరు విద్యార్థినిని స్థానిక నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. ఇక్కడ మాజీ సర్పంచ్ జోగుల మమత, నాయకులు గుగ్లావత్ రాజేందర్, తోట మోహన్, రొడ్డ రాజు, తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా కలప దందా..?

■ గుట్టుగా తరలిస్తున్న స్మగ్లర్లు ■ ఖాళీ అవుతున్న అడవులు ■ చోద్యం చూస్తున్న అధికారులు

కొడిమ్యాల, ఫిబ్రవరి 8: మండలంలో కలప అక్రమ దందా విచ్చలవిడిగా సాగుతోంది. సూరంపేట, గోవిందారం, దమ్మయ్యపేట, బొల్లెన్‌చెరువు, నల్లగొండ, హిమ్మత్‌రావుపేట తదితర గ్రామాల్లో రాత్రికి రాత్రే కలపను తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ముందుగా అడవి నుంచి తీసుకొచ్చిన కలపను స్థానికంగా ఉన్న దుగోడ మిషన్ల వద్ద సాన పట్టి కలపను వాహనాల్లో వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. అయితే ఈ ఆరు గ్రామాల్లో వందల ఎకరాల్లో విస్తరించి ఉన్న అడవిని స్మగ్లర్లు ఖాళీ చేస్తుంటే అధికారులు మాత్రం ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విచ్చలవిడిగా దుగోడ మిషన్లు

మండలంలో విచ్చల విడిగా దుగోడ మిషన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మిషన్లు ఏర్పాటు చేసి రాత్రి సమయాల్లో కలపను దుగోడ పట్టి కావాల్సిన విధంగా తయారు చేసుకొని వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. సోప సెట్లు, కుర్చీలు, డ్రెస్సింగ్ టేబుళ్లు, మంచాలు తదితర పరికరాలు తయారు చేసి వాహనాల్లో తరలిస్తున్నారు.

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం

కలపను అక్రమంగా తరలిస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. అడవిలో సిబ్బందితో పరిశీలించి విచారణ జరిపిస్తాం. ఎవరైనా అక్రమంగా కలపను తరలిస్తున్నట్లు తెలిస్తే మా మాకు సమాచారం ఇవ్వండి. చర్యలు తీసుకుంటాం. **- రేంజర్ లత, కొడిమ్యాల**

సూరంపేట అడవుల్లో నరికిన కలప మొక్కలు

మార్కెట్‌యార్డులో ధరలు

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 8 : జగిత్యాల వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం మక్కలు క్వింటాల్‌కు రూ. 2,088 – 2,088 చొప్పున ధర పలికిందని మార్కెట్ కార్యదర్శి టీ.రాజశేఖర్ తెలిపారు. ఎంటీయూ 1010 రకం ధాన్యానికి రూ. 1,711, హెచ్ఎంటీ రూ. 3,051, జైశ్రీరాం రూ.2,950, అనుములు రూ. 9,899 – 10,289, కందులు రూ. 8,666 – 9,275 చొప్పున ధరలు లభించినట్లు వివరించారు.

నృసింహస్వామి ఆలయ ఉత్సవ కమిటీ

సారంగాపూర్, ఫిబ్రవరి8: బీర్‌పూర్ శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి ఐదుగురు సభ్యులతో ఉత్సవ కమిటీని ఏర్పాటు చేస్తూ గురువారం ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఇన్‌చార్జి ఈవో సంకటాల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆలయం లో ఈనెల 19 నుంచి ఫిబ్రవరి 2 వరకు జాతర బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎనగంటి సామ్రాట్, కొల్లూ రి మల్లేశం, బాదినపెల్లి కాంత, గాజుల భూ మయ్య, గుర్రం శ్రీనివాస్‌తో కూడిన ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశారు.

నేడు జాతర టెండర్లు

సారంగాపూర్, ఫిబ్రవరి 8: బీర్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం జాతర టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఆలయ సీఈవో శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి19 నుంచి మార్చి02 వరకు నిర్వహించే జాతర బ్రహ్మోత్సవాల్లో కొబ్బరి కాయలు, బెల్లం, పూజా సామగ్రి, లడ్డు పులిహోర, గండదీపం, పట్టె నామాలు, కోరమీసాలు, కొబ్బరి ముక్కలు పొగుచేసుకునే హక్కు, తలనీలాలు, వివిధ దుకాణాలు నిర్వహించుకునేందుకు ఈ రోజు ఉదయం 9గంటలకు బహిరంగ టెండర్లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మేడిపల్లి, ఫిబ్రవరి 8: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్‌పోర్టు సైజు ఫొటోతో మీ సేవ కేంద్రంలో గానీ మోడల్ స్కూల్‌లోగానీ ఈనెల 22వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

కథలాపూర్, ఫిబ్రవరి 8: మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్ రోడ్డు సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు ఎన్ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు ఆకుల సంతోష్, జవ్వాజి రవి గురువారం తెలిపారు. వర్షాకాలంలో ఈ రోడ్డు జలమయమై ఉపాధ్యాయులు, విద్యార్థులు కాలినడకన వెళ్లడం కష్టంగా మారిందన్నారు. సీసీ రోడ్డు నిర్మిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలి

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి 8: ఆత్మకూర్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గీత పారిశ్రామిక సహకార సంఘ సభ్యులకు మధ్య నెలకొన్న వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకోవాలని తహసీల్దార్ శేఖర్, సీఐ లక్ష్మీనారాయణ సూచించారు. గురువారం మెట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఇరు వర్గాలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు. సాంఘిక బహిష్కరణ చట్ట విరుద్ధమని తెలిపారు. బహిష్కరణను కొనసాగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భూ వివాదాన్ని ఇరు వర్గాలు సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 8: ధర్మారం గ్రామంలోని రామాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. గ్రామానికి చెందిన దోడ ముత్తారెడ్డి కుమారుడు దివ్యాన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని రూ.20వేలతో హైమాస్ లైట్లను ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రంజిత్, సాగర్, శ్రీను, రాజేందర్, బాలయ్య పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అవగాహన

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 8: ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా జగిత్యాలలోని పలు వార్డుల్లో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ప్రతినిధులు అవగాహన కల్పించారు. గురువారం జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారని యూనియన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ పేర్కొన్నారు. ఇక్కడ జిల్లా బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాజారాంపటేల్ జయంతి

వెల్గటూర్, ఫిబ్రవరి 8: రాజారాంపల్లి వ్యవస్థాపకుడు ఏలేటి రాజారాంపటేల్ 179వ జయంతిని నిర్వహించారు. గ్రామంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయగా 150 మంది రక్త పరీక్ష, ఈసీజీ పరీక్షలు చేసి వారికి మందులు అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆకుల సంజీవరావు, తహసీల్దార్ ఉదయ్, ఎంపీవో శ్రీనివాస్, ఎంపీటీసీ గాజుల మల్లేశం, రాజారాంరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, చంద్రారెడ్డి, శైలేందర్‌రెడ్డి, విజయమోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, లచ్చిరెడ్డి పాల్గొన్నారు.

స్పాట్ వాల్యుయేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలి

సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ

జగిత్యాల, ఫిబ్రవరి 8: జగిత్యాలలో ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి, ఇంటర్ బోర్డు కమిషనర్ శృతి ఓజాకు గురువారం లేఖలు రాశారు. గత ప్రభుత్వం కొన్ని కొత్త జిల్లాల్లో ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ సెంటర్లను ఏర్పాటు చేసి జగిత్యాలను విస్మరించిందన్నారు. దీంతో జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, మోడల్ స్కూళ్ల అధ్యాపకులు మూల్యాంకన విధులు నిర్వహించేందుకు కరీంనగర్‌కు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అందులో వివరించారు. జగిత్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఎస్‌కేఎన్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనూ ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ సెంటర్‌ను ఏర్పాటుకు తగిన వసతులు ఉన్నాయన్నారు. తమ అభ్యర్థన మేరకు సీఎంకు లేఖ రాసిన జీవన్‌రెడ్డికి తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ –475 జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కొట్టాల తిరుపతిరెడ్డి, అత్తినేని శ్రీనివాస్, బాధ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

విహారయాత్రకు విద్యార్థులు

వెల్గటూర్, ఫిబ్రవరి 8: రాజారాంపల్లి అక్షర హైస్కూల్ విద్యార్థులు సిద్దిపేటలోని కోమటిచెరువు, కరీంనగర్‌లో నిర్మించిన తీగల వంతెన, మానేరు డ్యాం, శనిగరంలోని సరస్వతీ టెంపుల్‌ను సందర్శించారు. విద్యార్థులకు టీచర్లు అక్కడి ప్రత్యేకతలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఇక్కడ పాఠశాల యాజమాన్యం ఆశిరెడ్డి, అనంతరెడ్డి, రమేశ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

కోమటి చెరువు వద్ద విద్యార్థులు, టీచర్లు

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 8: యామాపూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం ఎంపీటీసీ బోర్గం వివేకవర్ధిని భూమి పూజ చేశారు. ఈజీఎస్ కింద మంజూరైన రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పోన్‌కంటి వెంకట్, తిమ్మని రాములు, అక్కనపెల్లి జగదీశ్, నాయకులు గూడ శ్రీకాంత్‌రెడ్డి, బూస రాజేశ్, వెంకట్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, సుదర్శన్, మహేశ్, రాజారెడ్డి, క్యాతం తిరుపతిరెడ్డి, ఆనంద్, లక్కడి నర్సవ్వ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-319433-All

CHANGE OF NAME

★ I, GOLI DAVAIAH, S/o. Narayana, R/o. 9-5-72/1, Bhagavantharao Nagar, Vemulawada, Rajanna Sircilla, TS. Changed My Name as GOLI DEVAIAH, S/o. Narayana.
NT-311088

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571
91827 77194

నియోజకవర్గ అభివృద్ధికి నిధులివ్వండి

మంత్రులను కలిసిన కోరిన కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

మంత్రికి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

మారుతీనగర్, ఫిబ్రవరి 8: కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని గత ప్రభుత్వం నియోజకవర్గానికి మంజూరు చేసిన ప్రత్యేక నిధులను కొనసాగించాలని హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పలువురు మంత్రులను కలిసి కోరారు. గురువారం తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో కోరుట్ల ఎమ్మెల్యే ఇరిగేషన్, సివిల్ సప్లయ్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే టూరిజం మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి కోరుట్ల పట్టణంలో గల పురాతన కట్టడమై బుర్జు చుట్టూ నూతన ఇండ్ల నిర్మాణానికి పురావస్తు శాఖ ఆదేశాలతో అనుమతి ఇవ్వకపోవడంతో ఆ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆ నిర్ణయాన్ని రద్దు చేసి ఇండ్ల నిర్మాణాలకు అనుమతివ్వాలని కోరారు. అదే విధంగా సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి నిధులను మంజూరు చేసి ఆదుకోవాలని సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాస్‌ను కలిసి కోరారు.

బల్దియా చైర్మన్‌పై అవిశ్వాసం ఉపసంహరణ

ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌తో కౌన్సిలర్లు

రాయికల్, ఫిబ్రవరి 8: రాయికల్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లపై కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ చొరవతో ఉపసంహరించుకున్నారు. ఈ మేరకు కౌన్సిలర్లు కలెక్టర్‌కు గురువారం వినతిపత్రం అందించారు. సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు అవిశ్వాస తీర్మానాన్ని వెనక్కి తీసుకున్నామని కౌన్సిలర్లు చెప్పారు.

బీఆర్ఎస్ నేతకు ఎమ్మెల్యే పరామర్శ

సారంగాపూర్, ఫిబ్రవరి 8: మండలంలోని రేచపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బాలే సత్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నోవా ఈఎన్‌టీ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. గురువారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ దవాఖానలో ఆయనను పరామర్శించారు.

అంజన్న హుండీ ఆదాయం రూ.83.91 లక్షలు

ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

మల్యాల, ఫిబ్రవరి 8: కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.83,91,502 సమకూరినట్టు దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ఆలయ ఈవో టంకశాల వెంకటేశం తెలిపారు. గురువారం ఆలయంలోని 9 హుండీలను 28 రోజులకు విప్పి లెక్కించగా నగదుతోపాటు 32 గ్రాముల మిశ్రమ బంగారం, 4 కిలోల 500 గ్రాముల మిశ్రమ వెండి, 13 విదేశీ కరెన్సీ నోట్లు సమకూరయన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో వైరా గ్యం అంజయ్య, ఆలయ పర్యవేక్షకులు సు నీల్, శ్రీనివాస్ శర్మ, ఇన్‌స్పెక్టర్లు జెమిని శ్రీనివాస్, సంపత్, సిబ్బంది ధర్మేందర్, యాదగిరి, బండ లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాసాచారి, సురేందర్‌రెడ్డి, ఎస్ఐ తీగల అశోక్, ఏఎస్ఐ రమణారెడ్డి, శ్రీ రాజరాజేశ్వర సేవాసమితి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో కేంద్రం విఫలం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సుతారి రాములు

కోరుట్ల, ఫిబ్రవరి 8: బీడీ కార్మికుల సమస్యల పరిష్కారంలో కేంద్రంలోని బీజేపీ సర్కార్ విఫలమైందని ఏఐటీయూసీ అనుబంధ బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు అన్నారు. గురువారం పట్టణంలోని సీ ప్రభాకర్ భవన్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, బీడీ పరిశ్రమపై అనేక ఆంక్షలు, నిబంధనలు విధిస్తూ కార్పొరేట్ బహుళ జాతి కంపెనీలైన సిగరెట్ కంపెనీలకు అప్పజెప్పాలని కేంద్రం కుట్రలు చేస్తున్నదన్నారు. బీడీ ఫ్యాక్టరీలో ఆకు, బీడీ, తంబాకు సరఫరాపై 28 శాతం జీఎస్టీ విధించిందని పేర్కొన్నారు. సమావేశంలో టీఎస్ బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు సామల మల్లేశం, ఎండీ ముక్రం, కొక్కుల శాంత, అనసూయ, గోవర్ధన్, గోదావరి, శ్రీనివాస్, రంగారెడ్డి, భానుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 'మన ఇసుక వాహనం' అమలు

■ ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే ఇంటి వద్దకే ■ కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 8: జిల్లాలో గృహ నిర్మాణాలకు, వాణిజ్య అవసరాలకు కావాల్సిన ఇసుకను సరఫరా చేసేందుకు గానూ జిల్లా యంత్రాంగం మన ఇసుక వాహనం పేరుతో నూతన పాలసీని రూపొందించినట్లు కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ ప్రజలకు ఇసుకను తక్కువ ధరకు అందించే లక్ష్యంతో ప్రైవేట్ వ్యక్తుల ప్రమేయం లేకుండా అత్యంత పారదర్శకంగా ప్రభుత్వమే నేరుగా వినియోగదారులకు ఇసుకను సరఫరా చేసే విధానాన్ని రూపొందించిందని, దీనిలో భాగంగా జిల్లాలో గోదావరి పరీవాహక మండలాలతోపాటు ఇసుక లభ్యమయ్యే ఆరు మండలాలైన ధర్మపురి మండలంలోని రాజారం, ఆరెపల్లి, కోరుట్ల మండలంలోని పైడిమడుగు, రాయికల్ మండలంలోని ఇటిక్యాల, జగన్నాథ్‌పూర్, మల్లాపూర్ మండలంలోని సాతారం, మెట్‌పెల్లి మండలంలోని ఆత్మకూర్, కథలాపూర్ మండలంలోని తక్కళ్లపల్లి గ్రామాల్లో ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేశామని, ఇసుక రీచ్‌ల నుంచి అవసరమైన వినియోగదారులకు ఇసుకను సరఫరా చేస్తామని తెలిపారు. ఇసుక అవసరం ఉన్న వారు https://tsmlv.cgg.gov.in అనే వెబ్ సైట్ ద్వారా లేదా గూగుల్ ప్లేస్టోర్ నుంచి మన ఇసుక వాహనం మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వివరాలు నమోదు చేసి ఆన్‌లైన్‌లో నగదు చెల్లిస్తే ప్రభుత్వమే వాహనం ద్వారా ఇసుకను వినియోగదారుడి ఇంటికి చేరుస్తుందని, దూరాన్ని బట్టి ధర నిర్ణయిస్తామని కలెక్టర్ వివరించారు. ఇసుక సరఫరా సమాచారం కోసం కలెక్టరేట్‌లో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, 9490053631, 9441670065 నంబర్లలో లేదా స్థానిక తహసీల్దార్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

రెండో ఏఎన్ఎంలను క్రమబద్ధీకరించాలి

జగిత్యాల, ఫిబ్రవరి 8: పరీక్ష లేకుండానే రెండో ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని సంఘం రాష్ట్ర నాయకురాలు పడాల మమత అధికారులను కోరారు. గురువారం హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా, హెల్త్ కమిషనర్ కర్ణన్, హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్‌కు హైదరాబాద్‌లో వినతిపత్రం అందించారు. ఆమె వెంట జిల్లా అధ్యక్షురాలు చిలుకమ్మ, వసంత, మేరీ, జయప్రద, సుప్రియ, శైలజ, రాధ, విజయలక్ష్మి, నీరజ ఉన్నారు.

లక్ష్యాన్ని చేరుకోవాలి

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 8: సెర్ప్ కార్యక్రమాల్లో వేగం పెంచి లక్ష్యాన్ని చేరుకోవాలని జిల్లా సెర్ప్ ఫైనాన్స్ అధికారి విజయ భారతి, జిల్లా మార్కెటింగ్ అధికారి మల్లేశం సిబ్బందికి సూచించారు. గురువారం మండల సెర్ప్ కార్యాలయంలో జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు బ్యాంక్ లింకేజీ టార్గెట్ పూర్తి చేయాలని, ఎస్‌పీఏలు లేకుండా చూడాలని, ఎంటర్ ప్రైజెస్ గ్రౌండింగ్ పూర్తి చేయాలని, సీహెచ్‌సీ సెంటర్లు మంచిగా నడిచేలా చూడాలని కోరారు. ఏపీఎం గంగాధర్, సీసీలు రవీందర్, గంగారాం, శ్రీనివాస్, విద్యాసాగర్ ఉన్నారు.

బాలల హక్కులపై అవగాహన

జగిత్యాల టవర్ సర్కిల్, ఫిబ్రవరి 8: మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో జగిత్యాలలోని పురాణిపేట జడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో గురువారం విద్యార్థులకు బాలల హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విభాగం అధికారి పడాల సురేశ్ మాట్లాడుతూ, విద్యార్థులు లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలని సూచించారు.

11న టీపీటీఎఫ్ మహాసభ

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి 8: ఖమ్మం జిల్లాలోని కంభం పట్టణంలో ఈనెల 11, 12వ తేదీల్లో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) రెండో విద్యా వైజ్ఞానిక మహాసభలను నిర్వహించనున్నట్లు టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్ తెలిపారు. ఈమేరకు మహాసభలకు సంబంధించిన పోస్టర్లను వెల్లుల్ల జడ్పీహెచ్ఎస్‌లో గురువారం ఆవిష్కరించారు. టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాజనర్సయ్య, మండలాధ్యక్షుడు వహీదుద్దీన్, రవీందర్, రవి పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

వెల్గటూర్, ఫిబ్రవరి 8: కొండాపూర్ గ్రామానికి చెందిన యువ క్రికెటర్లకు అదే గ్రామానికి చెందిన పీసీసీ మెంబర్ తాటిపర్తి శైలేందర్‌రెడ్డి టీ షర్టులను అందజేశారు. ఈ సందర్భంగా యువకులు శైలేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, యువకులు పాల్గొన్నారు.

నల్లగొండలో అనుమానాస్పద మహిళ

■ పట్టుకొని పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు
■ పిల్లల కిడ్నాప్‌కోసమే అంటూ వాట్సాప్‌లో వైరల్

కొడిమ్యాల, ఫిబ్రవరి 8 : మండలంలోని నల్లగొండలో గురువారం ఓ మహిళ అనుమానాస్పదంగా కనిపించగా గ్రామస్తులు ఆమెను పోలీసులకు అప్పగించారు. భూపాలపల్లికి చెందిన మహిళ గ్రామంలోని ఓ దుకాణం వద్దకు వెళ్లింది. అక్కడే ఉన్న ఓ చిన్నారిని దగ్గరకు తీసుకుని వంద రూపాయలు ఇస్తుండగా గమనించిన తల్లిదండ్రులు ఆమె వద్ద నుంచి పాపను తీసుకొని అక్కడున్న వారికి జరిగిన విషయం చెప్పారు. వారు సదరు మహిళను వివరాలు అడుగడంతో గతంలో చిన్నారులను కిడ్నాప్ చేశానని, ఇప్పుడు చేయడం లేదని చెప్పింది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో హెడ్ కానిస్టేబుల్ హర్షరాజు, మహిళా హెడ్ కానిస్టేబుల్ సౌందర్య మహిళను విచారించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. మహిళ మానసిక స్థితి సరిగా లేదని తేలడంతో వదిలేశామని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. కాగా, అనుమానిత మహిళ వీడియో వాట్సాప్‌లో వైరల్‌గా మారింది.

స్క్రూడైవర్‌తో దాడి చేసిన వ్యక్తిపై కేసు

మల్యాల, ఫిబ్రవరి 8: మండల కేంద్రానికి చెందిన వేముల రతన్‌కుమార్‌ను స్క్రూడైవర్‌తో దాడి చేసి గాయపర్చిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు మల్యాల ఎస్ఐ తీగల అశోక్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులందరూ ఫొటోలు దిగుతున్న క్రమంలో మల్యాలకు చెందిన తునికి మహిపాల్‌కు వేముల రతన్‌కుమార్ మధ్య గొడవ తలెత్తింది. ఈ క్రమంలోనే కోపోద్రిక్తుడైన మహిపాల్ వాహనాలను స్క్రూడైవర్‌తో రతన్‌కుమార్ ఛాతిలో, కడుపులో పొడవడంతో గాయాలయ్యాయన్నారు. ఈ క్రమంలోనే రతన్‌కుమార్ తల్లి వేముల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కరెంట్ మీటర్లకు ఆధార్ అనుసంధానం

జగిత్యాల, ఫిబ్రవరి 8: గృహజ్యోతి కింద సర్కారు 200 యూనిట్ల ఉచిత కరెంట్ అమలు కోసం సిబ్బంది కరెంట్ మీటర్లకు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డులను అనుసంధానిస్తున్నారు. ఇందులో భాగంగా జగిత్యాలలోని 35 వార్డులో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆధార్ సీడింగ్ చేశారు. రీడింగ్, బిల్లు వివరాలు నమోదు చేసుకున్నారు. వార్డు కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ రఘు, ఎలక్ట్రిసిటీ అధికారి రాంజీ ప్రకాశ్ పర్యవేక్షించారు.

బాలల హక్కులపై అవగాహన

జగిత్యాల టవర్ సర్కిల్, ఫిబ్రవరి 8: మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో జగిత్యాలలోని పురానిపేట జడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో గురువారం విద్యార్థులకు బాలల హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విభాగం అధికారి పడాల సురేశ్ మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ ఫోన్, మత్తు పదార్థాలకు అలవాటు పడవద్దన్నారు. లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలని సూచించారు.

లక్ష పుష్పార్చనకు భక్తులు తరలిరండి

మారుతీనగర్, ఫిబ్రవరి 8: మెట్‌పల్లి పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం నిర్వహించే లక్ష పుష్పార్చన కార్యక్రమానికి ఆర్యవైశ్య సంఘ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని దేవాలయ అధ్యక్షుడు చాడ సురేశ్ తెలిపారు. హల్దీపూర్ పీఠాధిపతి శ్రీ వామనాశ్రమ స్వామిజీ ఆధ్వర్యంలో పుష్పార్చన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక్కడ పలువురున్నారు.

కోరుట్లలో ఒకరి దారుణ హత్య

■ పాత కక్షల నేపథ్యంలో కత్తితో దాడి
■ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి

వెంకటరమణ (ఫైల్)

కోరుట్ల, ఫిబ్రవరి 8: పట్టణంలోని అర్బన్ కాలనీలో గురువారం ఓ వ్యక్తి దారుణహత్యకు గురైన సంఘటన సంచలనం రేకెత్తించింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గాంధీరోడ్డులో నివాసం ఉంటున్న అనుమల్ల వెంకటరమణ (55) వడ్డీ వ్యాపారంతో పాటు చిన్నాచితక పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అర్బన్ కాలనీకి చెందిన వాసాల రఘుకు వెంటకరమణకు మధ్య మనస్పర్థలు ఉన్నాయి. పాత కక్షలు మనసులో పెట్టుకున్న రఘు అర్బన్ కాలనీకి వచ్చిన వెంకటరమణపై దాడి చేసేందుకు వ్యూహం పన్నాడు. బైక్‌పై వెళ్తున్న వెంకటరమణపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడ్డ వెంకటరమణ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. హత్య జరిగిన స్థలాన్ని మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ కిరణ్‌కుమార్ పరిశీలించారు. హత్యకు దారి తీసిన వివరాలపై స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం


కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 8 : జిల్లా కేంద్రంలో జగదాలయ ఆధ్యాత్మిక బృందం ఆధ్వర్యంలో వైభవంగా శ్రీసీతారాముల కల్యాణం, పట్టాభిషేకం నిర్వహించారు. అయోధ్య బలరాముడి ప్రాణప్రతిష్ఠ జరిగిన శుభ సందర్భంగా పట్టణంలో మూడు రోజుల పాటు అఖండ హనుమాన్ చాలీసా అహోరాత్రి పారాయణం, మహాయజ్ఞం, లక్ష తమలపాకులతో ఆంజనేయస్వామి వారికి అర్చన చేశారు. అనంతరం శృంగేరి శారదాపీఠ ఆస్థాన పౌరాణికులు, భారతీ తీర్థ పురస్కార గ్రహీత డాక్టర్ బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి, వేణుగోపాలచార్య కౌశిక గార్లతో ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో కల్యాణాన్ని జరిపించారు. కార్యక్రమంలో నిర్వాహకులు చెట్ల చంద్రశేఖర్, కోటగిరి శ్రావణ్‌కుమార్, మార కైలాసం, బోనగిరి రాంనారాయణ ఉన్నారు.

బీసీలకు రూ. 25 వేల కోట్లు కేటాయించాలి

జగిత్యాల, ఫిబ్రవరి 8: ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.25 వేల కోట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ కోరారు. గురువారం జగిత్యాలలో ఆయన మాట్లాడారు. బీసీ కులాలకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని, పెండింగ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి అలిశెట్టి ఈశ్వరయ్య, యూత్ జిల్లా అధ్యక్షుడు కొక్కు గంగాధర్, ప్రధాన కార్యదర్శి అనుమల్ల సంజయ్ సామ్రాట్, నియోజకవర్గ అధ్యక్షుడు తిరుపురం రాంచందర్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జాజాల రమేశ్, రాష్ట్ర కోఆర్డినేటర్ రుషికేశ్, నాయకులు తిరుపురం శ్రవణ్ కుమార్ ఉన్నారు.

పద్మశాలీ సంఘం ఎన్నిక

పెగడపల్లి, ఫిబ్రవరి 8: నందగిరి గ్రామంలో గురువారం పద్మశాలీ సేవా సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా కోట మల్లేశం, యువజన సంఘం అధ్యక్షుడిగా పన్నాటి గంగాధర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గాజుల గంగాధర్, మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు గాజుల గంగమల్లేశం పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలి

జగిత్యాల, ఫిబ్రవరి 8: నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ నాయకులు వెన్న మహేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం డీఎంఅండ్‌హెచ్‌వో శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ, ఎన్‌హెచ్ఎం నేతలున్నారు.